క్లుప్తంగా

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



నరసరావుపేట: వైఎస్సార్ బీమా సభ్యత్వం తీసుకున్న వారికి అందిస్తున్న ప్రమాద బీమా పార్టీకోసం పనిచేస్తున్న కార్యకర్తల కుటుంబాలకు ధీమాగా ఉంటుందని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎనిమిదవ వార్డు వెంగళరెడ్డి కాలనీ చెందిన పార్టీ కార్యకర్త సయ్యద్ అమీర్ ఇటీవల చిలకలూరిపేట నుంచి నరసరావుపేటకు వస్తూ పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. అతడి భార్యకు ఆర్థికసాయంగా ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.5లక్షల బీమా చెక్కును గురువారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ డబ్బులతో కార్యకర్త కుటుంబానికి కొంతవరకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. కుటుంబ సభ్యులు సీఎం వైఎస్ జగన్‌కు, ఎమ్మెల్యేకు తమ కృతజ్ఞతలు తెలిపారు. షేక్ కరిముల్లా, షేక్ ఖాజా, సయ్యద్ ఫాతిమా పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి రామిరెడ్డి విశేష కృషి

నాదెండ్ల: విద్యాభివృద్ధి, గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన వ్యక్తి నడికట్టు రామిరెడ్డి అని జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం కె.సుందరరావు చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల ఫౌండర్, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన్ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడిచిన కొన్నేళ్లుగా రామిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హైస్కూలు, ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాలు జరుపుకోవటం ఆనవాయితీగా వస్తుందన్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కరిముల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడు అరెస్టు

చిలకలూరిపేటటౌన్: గత నెల 29వ తేదీ అనుమానాస్పదంగా మృతి చెంది కనిపించిన షేక్ ముంతాజ్‌బేగం(47) హత్యకేసును పోలీసులు ఛేదించారు. ఆమె హత్యకు కారకుడైన గుడికందుల వెంకట సుబ్బారావును బుధవారం రాత్రి అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 29వ తేదీ టిడ్కో గృహాల్లోని బ్లాక్ నంబర్ ఏ-64 మూడో అంతస్తులో టీ-10 ప్లాట్‌లో షేక్ ముంతాజ్ బేగం అనుమానాస్పదంగా మృతి చెందింది. అంతకుముందే మూడు రోజుల కిందటే అంటే అక్టోబర్ 26వ తేదీ మృతి చెందినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. ముంతాజ్‌బేగంకు పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే సుబ్బారావుతో రెండు సంవత్సరాల నుంచి వివాహేతర సంబంధం ఉంది. సుబ్బారావుకు బయట అనేక అప్పులు ఉండటంతో అక్టోబర్ 26వ తేదీ టిడ్కో గృహాల్లో ముంతాజ్‌బేగంకు చెందిన ప్లాట్‌లో ఆమెను హత్య చేసి, మెడలో ఉన్న ఏడు సవర్ల బంగారాన్ని అపహరించుకొని వెళ్లాడు. పోలీసులు బుధవారం రాత్రి సుబ్బారావును అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఏడు సవర్ల బంగారాన్ని రికవరీ చేశారు.

మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

యడ్లపాడు: ప్రజాప్రతినిధులు అధికారపక్షం ..ప్రతిపక్షం అనే వ్యత్యాసాలను వీడి సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం గురువారం ఎంపీడీఓ వై.హనుమారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ముందుగా వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు, ప్రభుత్వ పథకాల గురించి అధికారులు వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో నిర్వహించేందుకు 1257 ఉపాధి హామీ పథకం పనులు గుర్తించినట్లు సమావేశంలో తీర్మానించారు. అలాగే మండల పరిషత్ నిధులు రూ.52 లక్షలతో వివిధ గ్రామాల్లో సీసీడ్రైన్లు, రోడ్లకు సంబంధించి 30 పనులు చేపట్టుటకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ వై హనుమారెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రజల కోసం శ్రమించే సీఎం జగనే రాష్ట్రానికి కావాలి

- నరసరావుపేట టౌన్, మండలం, రొంపిచర్ల మండలాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు
- ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు బ్రోచర్లు అందజేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



బరంపేట ఒకటో వార్డు సచివాలయంలో ఏపీకి జగనే మళ్లీ ఎందుకు కావాలి ప్రాధాన్యతను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: నిరంతరం ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్రానికి మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని బరంపేట ఒకటో వార్డు సచివాలయం, నరసరావుపేట మండలం ఇక్కుర్రు, రొంపిచర్ల మండలం అన్నారం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాలయాల పరిధిలో ప్రజలకు అందిన సంక్షేమం, అభివృద్ధి పథకాలకు చెందిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఇల్లిల్లూ తిరుగుతూ ఆంధ్రప్రదేశ్‌కు సీఎంగా జగనే మళ్లీ ఎందుకు కావాలంటే అనే అంశాలను వివరిస్తూ బ్రోచర్లను అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ, సంక్షేమ పథకాలు, ఇళ్లవద్దకే పింఛన్లు, రేషన్ పంపిణీ, ఊరూరా, వాడవాడలా అభివృద్ధి కావాలంటే రాష్ట్రానికి మళ్లీ సీఎంగా జగన్‌కు మద్దతు పలకాలన్నారు. సచివాలయాలు ఏర్పాటుచేసి అందులో పదిమంది ఉద్యోగులను నియమించి 650 సేవలను ప్రజల ముంగిటకే తీసుకొచ్చారన్నారు. ప్రతి 50, 100గృహాలకు వలంటీర్లను ఏర్పాటుచేసి ఇంటివద్దకే ప్రభుత్వ పథకాలు అందేలా చేశారన్నారు. ప్రతి గ్రామం, వార్డులో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ఉచితంగా వైద్యసేవలు అందజేశారన్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కితే సీఎం వైఎస్ జగన్ తానిచ్చిన వాగ్దానాల్లో 99.5శాతం అమలుచేశారన్నారు. దీంతో జగన్ అంటే ఒక నమ్మకం, చెబితే చేస్తారనే విశ్వాసం ప్రజల్లో కలిగించాడన్నారు. మళ్లీ మాయమాటలతో చంద్రబాబు వస్తున్నాడని ప్రజలు నమ్మవద్దని కోరారు. గ్రామాల్లో 100ఏళ్ల తర్వాత పొలాలకు రీసర్వే, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటుచేశారన్నారు. జిల్లా కేంద్రంగా నరసరావుపేటను చేశామని, పట్టణంలో రెండు నూతన పీహెచ్‌సీలు ప్రారంభించామని, జేఎన్‌టీయూ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 15వేల మందికి జగనన్న కాలనీల్లో ఇళ్లపట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టుకునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్లకు వలంటీర్ల ద్వారా పథకాలు అందాయని, ఒక్కో ఇంటికి రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. వారందరూ మళ్లీ జగన్‌కు అధికారం అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఖాజావలి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరక్టర్ ఎస్.సుజాతాపాల్, జెడ్పీటీసీ సభ్యుడు పద



రొంపిచర్ల మండలం అన్నారం సచివాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి



తూబాడులో కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులు

ముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, వైఎస్సార్ సీపీ రొంపిచర్ల అధ్యక్షుడు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, జిల్లా ప్రచార కార్యదర్శి గానుగపంట ఉత్తమరెడ్డి, ఎంపీటీసీ రాపూరి కుమారి, మాజీ సర్పంచు కోడూరి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పచ్చవ రవీంద్రబాబు, చపారపు గోపాలరెడ్డి, అన్నెంపున్నారెడ్డి, రామిసెట్టి కొండ, షేక్ మాబు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తూబాడులో...

నాదెండ్ల: గడిచిన నాలుగున్నరేళ్ల పాలనలో అందిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తిరిగి అమలు కావాలంటే రాష్ట్రానికి మరో దఫా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాల్సిన అవసరం ఉందని ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు పేర్కొన్నారు. నాదెండ్ల మండలం తూబాడు గ్రామంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం గురువారం నిర్వహించారు. సర్పంచ్ గోళ్లమూడి కాశయ్య అధ్యక్షతన సచివాలయంలో ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, జగనన్న సురక్ష మండల కన్వీనర్ రవికుమార్‌తో పాటు నాయకులు కలిసి సమావేశమయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో గడిచిన నాలుగున్నరేళ్లలో గ్రామంలో రూ.27 కోట్ల అభివృద్ధి, సంక్షేమం జరిగిందన్నారు. సుమారు రూ.22 కోట్లు ప్రత్యక్షంగా, మరో రూ.5కోట్లు పరోక్షంగా లబ్ధి కలిగిందన్నారు. అనంతరం సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షులు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, ఎంపీడీఓ జాకీర్ హుస్సేన్, ఎంఈఓ ఆంజనేయులు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, సర్పంచ్‌లు పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, రవికుమార్, నాయకులు గద్దె కోటయ్య, బ్రహ్మయ్య, లూర్దురెడ్డి పాల్గొన్నారు.

అయ్యన్నపాలెంలో ..

బొల్లాపల్లి: మండలంలోని అయ్యన్నపాలెం సచివాలయంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సచివాలయం పరిధిలో లబ్ధిపొందిన వివరాలను సచివాలయం డాష్ బోర్డులో ప్రదర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పి.సాయిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నిర్విఘ్నంగా అమలు చేశారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్ల సహకారంతో సంక్షేమం గడపగడపకు చేరిందన్నారు. ఈ సచివాలయం పరిధిలో 16.69కోట్ల మేర ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధిచేకూరిందని తెలిపారు. డీబీటీ ద్వారా రూ.12.97 కోట్ల మేర, నాన్ డీబీటీ ద్వారా రూ.3.72 కోట్ల మేర 931 మంది లబ్ధిదారులు లబ్ధిపొందారని వివరించారు. గత ప్రభుత్వాల్లో అమలు చేయని సంక్షేమాభివృద్ధి ఈ ప్రభుత్వ హయాంలో జరిగిందని తెలిపారు. ఎంపీటీసీ బి.లక్ష్మీబాయి, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ జి.శ్రీహరి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు బి.మంత్రునాయక్, సక్రునాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి యడ్లపాడు మండలంలో...

యడ్లపాడు: ప్రతిగ్రామం..ప్రతి గడపకు అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పారదర్శకంగా చేస్తున్న పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులు సిద్ధం కావాలని ఎంపీపీ పిడతల ఝాన్సీ పిలుపునిచ్చారు. శుక్రవారం నుంచి మండలంలో ప్రారంభమయ్యే 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం షెడ్యూల్‌ను ఎంపీడీఓ వై.హనుమారెడ్డితో కలిసి వెల్లడించారు.

అన్నివర్గాలకు సంక్షేమాభివృద్ధి ఫలాలు..



చిలకలూరిపేటలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చిలకలూరిపేట: అన్నివర్గాలకు సంక్షేమాభివృద్ధి ఫలాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికే దక్కుతుందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని 38వ వార్డు సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. సచివాలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి సంక్షేమాభివృద్ధి పథకాలు వివరించే బోర్డు ఏర్పాటు చేశారు. ఎన్‌ఆర్‌టీ రోడ్డులో పార్టీ జెండాను ఎగురవేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్మన్ షేక్ రఫాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను పవిత్రగ్రంథంగా భావించి నాలుగున్నరేళ్ల కాలంలోనే ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని చెప్పారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ప్రతి కుటుంబానికి మేలు చేశారని పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా ప్రజలకు ప్రభుత్వ సేవలను గడపవద్దే అందించటమే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చారని చెప్పారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు క్లస్టర్ -2 విడదల కమలేంద్ర మాట్లాడుతూ ఒక్క 38వ వార్డు పరిధిలోనే డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ. 16.92 కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. ఇందులో డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా చేకూరిన లబ్ధి రూ.10.80 కోట్లని వెల్లడించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు క్లస్టర్-1 పఠాన్ తలహాఖాన్, వార్డు ఇన్‌చార్జి యాదాల వెంకటసుజాత, నాయకులు తోట బ్రహ్మస్వాములు, గుంజి వీరాంజనేయులు, సయ్యద్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

డీఎస్పీ కేవీవీ మహేష్



బాణసంచా దుకాణదారులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ కేవీవీ మహేష్

నరసరావుపేట టౌన్: దీపావళి బాణసంచా విక్రయదారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని డీఎస్పీ కేవీవీ మహేష్ స్పష్టం చేశారు. గురువారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను ఆయన పరిశీలించారు. అక్కడ నిర్వాహకులు చేపట్టిన రక్షణ చర్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా దుకాణదారులను ఉద్దేశించి మాట్లాడారు. నిబంధనల ప్రకారం దుకాణ యజమానులు నడుచుకోవాలన్నారు. అగ్నిమాపక శాఖ నిబంధనలు ప్రకారం ప్రమాదాలు జరిగిన సమయంలో నివారణకు వినియోగించే సామగ్రిని అందుబాటులో ఉంచాలన్నారు. హోల్‌సేల్ దుకాణ యజమానులు లైసెన్స్‌లను రెన్యూవల్ చేయించాలన్నారు. దుకాణాలు జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా బాణసంచా కలిగి ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా చిలకలూరిపేట, వినుకొండ పట్టణాలలో ఏర్పాటు చేసిన దుకాణాలను పరిశీలించి యజమానులకు తగు సూచనలు చేసినట్లు తెలిపారు.

సురక్ష శిబిరాల్లో అత్యుత్తమ వైద్యసేవలు

- డీఎంహెచ్ఓ డాక్టర్ రవి
- ప్రకాష్‌నగర్ సెయింటాన్స్ కళాశాల శిబిరంలో 282 మందికి వైద్యసేవలు



కళాశాల ఆవరణలో జరుగుతున్న శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ బి.రవి

నరసరావుపేట: అనుభవజ్ఞులైన డాక్టర్లు, శిక్షణ పొందిన వైద్య సిబ్బంది, మంచి మందులతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. గురువారం ప్రకాష్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ఆవరణలో పదోవార్డు ప్రజలకోసం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, పరీక్షలు, మందుల పంపిణీ ఏవిధంగా జరుగుతుందో తెలుసుకున్నారు. కాగా, శిబిరంలో మొత్తం 282మంది వైద్యం చేయించుకునేందుకు తమ పేర్లను నమోదు చేసుకోగా అందులో 168 మంది మహిళలు, 92 మంది పురుషులు, 24మంది పిల్లలు ఉన్నారు. ఎంవీ రెడ్డి కంటి వైద్య సిబ్బంది 128మందికి కంటి పరీక్షలు చేశారు. ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, జనరల్ సర్జన్ డాక్టర్లు మోహన్, మహేశ్వరరెడ్డి, ప్రాథమిక వైద్యశాల డాక్టర్లు జి.హర్షవర్ధనరెడ్డి, ప్రియాంక వైద్యసేవలు అందజేయగా, వైద్యసిబ్బంది రక్తపరీక్షలు, బీపీ, మధుమేహం పరీక్షలు చేశారు. ఒక్కొక్కరికి రూ.100 నుంచి రూ.1500 విలువైన మందులను ఉచితంగా అందజేశారు. మాజీ కౌన్సిలర్లు మాగులూరి రమణారెడ్డి, బోయిన రామకృష్ణ, నాయకులు వి.పెద్దిరెడ్డి, కె.గురుప్రసాదరావు, ఆర్.భాస్కరరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సహాయ, సహకారాలు అందజేశారు.

ఉచిత న్యాయ సలహాలు పొందవచ్చు

న్యాయమూర్తి శోభారాణి



న్యాయసదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శోభారాణి

నరసరావుపేట ఈస్ట్: మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సలహాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభారాణి తెలిపారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు న్యాయసేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఏపీ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి శోభారాణి మాట్లాడుతూ, న్యాయసేవల దినోత్సవం ప్రాధాన్యత, ఉచిత న్యాయ సేవలు పొందే విధానాలను వివరించారు. న్యాయ విజ్ఞాన సదస్సులు, లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించారు. గత ఏడాది కాలంలో 27 లోక్ అదాలత్‌లను ఏర్పాటు చేసి 1908 కేసులను రాజమార్గం ద్వారా, 42 ముందస్తు వాజ్యాలను పరిష్కరించినట్టు తెలిపారు. సంస్థ కార్యదర్శి అబ్బూరి ఏడుకొండలు, పారా లీగల్ వలంటీర్ ఎం.కాంచన, ఎస్ఐ వై.వినోద్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.సుకన్య పాల్గొన్నారు.

అన్నదానం, దుప్పట్లు పంపిణీ

నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి విద్యాసంస్థల అధినేత అట్లూరి శాంతి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు, దుప్పట్లు, ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెంలోని వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. మదర్ థెరిస్సా వృద్ధాశ్రమం, వకులమాధవి ఆశ్రమం, శ్రీనివాస అంధుల బాలికల ఆశ్రమంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. పట్టణంలోని వివిధ కూడళ్లలో ఉచిత వైద్య పరీక్ష శిబిరాలు నిర్వహించారు. అట్లూరిశాంతి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవ్‌భూషణ్‌రావు, అకడమిక్ డీన్ డాక్టర్ లక్ష్మీసురేఖ పాల్గొన్నారు.


విశ్వవిద్యాలయ బాస్కెట్‌బాల్ జట్లకు ఎంపిక

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్లకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు గురువారం తెలిపారు. పురుషుల విభాగానికి కళాశాలకు చెందిన జి.సాల్మన్‌రాజు (ద్వితీయ ఎంపీఈడీ), కూచి భానుప్రకాష్ (ద్వితీయ బీపీఈడీ) పొదిలి సురేష్ (ప్రథమ బీపీఈడీ)లు ఎంపిక కాగా షేక్ చాందిని (ద్వితీయ బీపీఈడీ), జి.నందిని (ప్రథమ ఎంపీఈడీ), వి.వెంకటలక్ష్మి (ప్రథమ బీపీఈడీ), ఐ.తిరుపతమ్మ (ప్రథమ బీపీఈడీ), కె.అఖిల (ద్వితీయ బీపీఈడీ)లు మహిళా జట్టుకు ఎంపికయ్యారన్నారు. పురుషుల జట్టు కేరళ యూనివర్సిటీ త్రివేంద్రంలో, మహిళల జట్టు బెంగళూరు యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్రావుతో పాటు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరి, అధ్యాపకులు ఆర్.బలరాంనాయక్, ఎం.సురేష్, ఎం.దాసులు అభినందించారు.

యువకుడు అనుమానాస్పద మృతి

నరసరావుపేట రూరల్: అదృశ్యమైన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండలంలోని ఇక్కుర్రులో గురువారం వెలుగుచూసింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇక్కుర్రు గ్రామానికి చెందిన గోపనబోయిన వెంకటేశ్వర్లు(28) పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో వార్డుబాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 6వ తేదీ సోమవారం రాత్రి ఆసుపత్రిలో విధులు ముగించుకుని బయటకు వచ్చిన వెంకటేశ్వర్లు ఇంటికి రాలేదు. దీంతో ఆసుపత్రిలోని స్నేహితులతో పాటు బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ దొరకలేదు. దీనిపై బుధవారం వెంకటేశ్వర్లు సోదరుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. మిస్సింగ్ కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ చేపట్టారు. గురువారం ఇక్కుర్రు కొండ సమీపంలోని ప్రధాన రహదారి వెంట దుర్వాసన రావడంతో స్థానికులు పరిశీలించగా మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ హజరత్తయ్య ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వెంకటేశ్వర్లు మృతదేహంతో పాటు సమీపంలో అతని ద్విచక్రవాహనం పడి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని తండ్రి పేరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హజరత్తయ్య తెలిపారు.

మాతృత్వం చిత్రానికి జాతీయ అవార్డు



వల్లెం కృష్ణ(ఫైల్)



కృష్ణ చిత్రీకరించిన మాతృత్వం చిత్రం

వినుకొండ టౌన్: చోడవరం చిత్రకళా నిలయం వారు జాతీయ స్థాయిలో ఇటీవల నిర్వహించిన చిత్రకళా పోటీలలో, వల్లెం కృష్ణ జాతీయస్థాయిలో మెరిట్ ప్రత్యేక జ్యూరీ అవార్డు పొందడంపై అతని గురువు ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ వినుకొండ రూరల్ గోకనకొండ గ్రామానికి చెందిన తన శిష్యుడు కృష్ణ చిత్రించిన మాతృత్వం చిత్రానికి జాతీయస్థాయి గుర్తింపు లభించడం సంతోషంగా ఉందన్నారు. మొదటి ప్రయత్నంలోనే ప్రతిభ కనబరిచి, అవార్డు సాధించిన కృష్ణ మరెన్నో అవార్డులు పొందాలని ఆకాంక్షించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



చిన్నబ్బాయి (ఫైల్)

వినుకొండ(నూజెండ్ల): అకాల వర్షంతో పాటు పిడుగుపడటంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన నూజెండ్ల మండలం పువ్వాడ గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పరిమి చిన్నబ్బాయి (29) గేదెలు కాసేందుకు పొలం వెళ్లాడు. పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంతసేపటికీ చిన్నబ్బాయి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు రాత్రంతా గాలించారు. గురువారం ఉదయం పొలాల్లో విగతజీవిగా పడి ఉండటాన్ని గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య, ఆరు నెలల కుమార్తె ఉన్నారు.

జేఎన్‌టీయూ-ఎన్‌లో వర్క్‌షాప్

నరసరావుపేట ఈస్ట్: జేఎన్‌టీయూ-ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. విశాఖకు చెందిన భారత్ ఇన్‌స్టిట్యూట్ అండ్ టెక్నికల్ సర్వీసెస్ నిపుణులు వర్క్‌షాప్‌కు హాజరై క్వాలిటీ కంట్రోల్, టెస్టింగ్ విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు, ఐ.శ్రీఫణిసుష్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.